గోడప్రతుల ఆవిష్కరణ

గోడపత్రులను ఆవిష్కరిస్తున్న పోచారం శ్రీనివాసరెడ్డి, కాసుల బాల్‌రాజ్

కోటగిరి, అక్టోబర్ 6 : పట్టణంలో మాదిరిగానే కోటగిరిలో కోట్ల రూపాయలు వెచ్చించి అయ్యప్ప, సాయిబాబా ఆలయ నిర్మాణం చేపట్టడం గొప్ప విషయమని రాష్ట్ర వ్యవసాయ సలహాదారుడు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. కోటగిరి మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప, సాయిబాబా ఆలయ యంత్ర, విగ్రహ ప్రతిష్ఠాపన, మహాకుంభాభిషేక మహోత్సవ ఆహ్వాన కరపత్రాలు, గోడప్రతులను రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ.. ఆలయ స్థలదాతగా నిలిచిన విఠల్‌రావుగుప్తాతోపాటు వారి కుటుంబ సభ్యులను అభినందించారు. అంతకు ముందు ఆలయ నిర్మాణం, యాగశాలను పరిశీలించారు. కార్యక్రమంలో వెంకటేశ్వరశర్మ, స్థపతి డాక్టర్ మోతీలాల్, పోల విఠల్‌రావు గుప్తా, నిషాంత్, పోల అశ్విన్ గుప్తా, బీర్కూర్ గంగాధర్, ఎత్తొండ రాజస్వామి, మాజీ జడ్పీటీసీ శంకర్, మాజీ ఎంపీపీ గంధపు పవన్, సూదం శంకర్, బర్ల సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ హన్మంతు, విండో చైర్మన్ కూచి సిద్ధు, అనిల్ కులకర్ణి పాల్గొన్నారు.

దేవాదాయ శాఖ ఉద్యోగికి పదోన్నతి

మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా పత్రాన్ని అందుకుంటున్న రాములు

సుభాష్‌నగర్/ బోధన్, అక్టోబర్ 6 : రాష్ట్ర ప్రభుత్వం దేవాదాయ శాఖ ఉద్యోగులకు శనివారం పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో ఒకరికి ఉద్యోగోన్నతి లభించింది. బోధన్ పట్టణంలోని శ్రీ చక్రేశ్వర శివాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రాములుకు గ్రేడ్ -3 కార్యనిర్వాహక అధికారి (ఈవో)గా ఉద్యోగోన్నతి లభించింది. మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా శనివారం ప్రమోషన్ ప్రతిని అందుకున్నారు. జిల్లా కేంద్రంలోని లక్ష్మీనారాయణ ఆలయానికి రాములు ఈవోగా విధులు నిర్వర్తించనున్నారు.

అనారోగ్యంతో ఇందల్వాయి సర్వేయర్ మృతి

ఇందల్వాయి, అక్టోబర్ 6 : మండలకేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న మోహన్ (42) ఆదివారం మృతిచెందినట్లు తహసీల్దార్ వెంకట్‌రావు తెలిపారు. కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న మోహన్.. ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతూ ఉదయం మృతి చెందినట్లు తెలిపారు. తహసీల్ కార్యాలయ సిబ్బంది మోహన్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. క్యాక్రమంలో ఆర్ఐ మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

కుష్మాండదేవి పాహిమాం

- కొనసాగుతున్న దేవీ నవరాత్రోత్సవాలు
- మండపాల వద్ద ప్రత్యేకపూజలు

మండపం వద్ద కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

సిరికొండ నవయువ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద..

బాల్కొండ ఎన్టీఆర్ కాలనీలో అమ్మవారికి 108 రకాల ప్రసాదాలు..

భీమ్‌గల్‌లో అయ్యప్పనగర్‌లో కొలువైన దుర్గాదేవికి పూజలు

నగరంలో 10 వేల గాజులతో అలంకరణ..

కోటగిరి/ సుభాష్‌నగర్/ ఖిల్లీవాడి/ ధర్పల్లి/ సిరికొండ/ మోర్తాడ్/ బాల్కొండ/ భీమ్‌గల్/ నవీపేట, అక్టోబర్ 6 : దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా జిల్లావ్యాప్తంగా దేవీ మండపాల వద్ద, అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో నాలుగోరోజు ఆదివారం అమ్మవారిని కుష్మాండ దేవి, అన్నపూర్ణా దేవి, లలితా త్రిపుర సుందరి దేవిగా అలంకరించి పూజలు చేశారు. జిల్లాకేంద్రంలోని కిషన్‌గంజ్‌లో ఉన్న వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో వాసవీమాతను వెండి ఆభరణాలతో అలంకరించి పూజలు చేశారు. వినాయక్‌నగర్, పద్మారావు నగర్, గాయత్రీనగర్, వర్ని చౌరస్తా, పెద్దబజార్, చంద్రశేఖర్ కాలనీ, గౌతం నగర్, ఆర్యనగర్, ఏడుపాయల దుర్గమ్మ, ముబారక్‌నగర్ పెద్దమ్మ ఆలయాల్లో దుర్గామాతను వద్ద కుంకుమార్చనలు, పంచామృతాభిషేకాలతో పూజించారు. పలు దుర్గామాత మండపాల్లో మహిళలు కోలాటాలు, భజనలు చేస్తూ ఆధ్యాత్మికతను చాటుతున్నారు. న్యాల్‌కల్‌రోడ్ లలితాదేవి ఆశ్రమాలయంలో 22వ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా లలితాదేవికి 10 వేల గాజులతో అర్చన చేశారు. ఆలయ అర్చకుడు వేలేటి రాజేందర్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు కొనసాగాయి. సోమవారం లలితా త్రిపుర సుందరి జన్మదినోత్సవం పురస్కరించుకొని డోలోత్సవం, తులాభారం తదితర కార్యక్రమాలతో పాటు అన్నదానం చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో శ్రీ దుర్గాదేవి సేవా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కొలువుదీరిన దుర్గాదేవి వద్ద కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ధర్పల్లి మండలకేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీలో నెలకొల్పిన దుర్గామాత మండపం వద్ద ఆదివారం భక్తులు, మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. సీతాయిపేట్, రామడుగు, హోన్నాజీపేట్, దుబ్బాక మండపాల వద్ద దుర్గామాతను అన్నపూర్ణాదేవిగా అలంకరించి, ప్రసాదాలు సమర్పించి పూజలు చేశారు. సిరికొండ మండలకేంద్రంలో నవయువ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం వద్ద కుంకుమార్చన నిర్వహించారు. అనంతర భక్తులకు అన్నదానం చేశారు. మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాల్లో దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. కమ్మర్‌పల్లి పెద్దమ్మ ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. బాల్కొండలోని ఎన్టీఆర్ కాలనీలో దుర్గామాత అమ్మవారికి దుర్గాదేవి స్వాములు 108 రకాల ప్రసాదాలు సమర్పించారు. భీమ్‌గల్ అయ్యప్పనగర్‌లో దుర్గాదేవి మండపం వద్ద సుహాసినీ పూజ నిర్వహించారు. నవీపేటలో జై భవాని శరన్నవరాత్రి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో పూజలు చేశారు.

గుండారం వీడీసీ ఏర్పాటు

నూతన వీడీసీని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు

సారంగాపూర్, అక్టోబర్ 6 : నిజామాబాద్ రూరల్ మండలంలోని గుండారం గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ)ని ఆదివారం గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా దేవుడిగారి గోపాల్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా బి.పోశెట్టి, క్యాషియర్‌గా నాగిశెట్టి సంతోష్‌కుమార్, కార్యదర్శిగా ఎండీ అక్బర్‌ఖాన్, సలహాదారుడిగా ఎస్.సాయికుమార్‌తో పాటు 13 మంది సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కమిటీని మాజీ ఎంపీటీసీ అంకల గంగాధర్, సొసైటీ చైర్మన్ దాసరి శ్రీధర్, డైరెక్టర్ ఉమాపతి, వీడీసీ మాజీ చైర్మన్ సాయికుమార్, క్యాషియర్ పోతన్న, గ్రామపెద్దలు మీసాల సుధాకర్‌రావు, సందీప్‌రెడ్డి, సురేశ్ రెడ్డి, ప్రదీప్‌కుమార్ సన్మానించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

సిరికొండ, అక్టోబర్ 6 : మండలంలోని కొండాపూర్ గ్రామంలో ఒంటిప్ప తండాలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం పట్టుకున్నట్లు సిరికొండ ఎస్సై రామ్ తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కొనసాగుతున్న ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలు

ఖిల్లీవాడి, అక్టోబర్ 6 : జిల్లాలో ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఎస్సెస్సీ విద్యార్థులకు ఆదివారం సైన్స్ పరీక్షను నిర్వహించగా 112 మందికి 88 మంది హాజరు కాగా.. 24 మంది గైర్హాజరైనట్లు డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు కామర్స్ పరీక్ష నిర్వహించగా.. 71 మందికి 56 మంది హాజరుకాగా.. 15 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

డీటీ సెక్షన్ అసిస్టెంట్ లైన్‌మన్ సీనయ్యకు ఉత్తమ అవార్డు

అవార్డు అందుకుంటున్న సీనయ్య

ఖిల్లీవాడి, అక్టోబర్ 6 : నిజామాబాద్ జిల్లాకు చెందిన విద్యుత్ శాఖ డీటీ సెక్షన్ అసిస్టెంట్ లైన్‌మన్ సీనయ్య ఉత్తమ అవార్డు అందుకున్నారు. తిరుపతిలో ఆదివారం నిర్వహించిన బహుజన సాహిత్య అకాడమీ ఎనిమిదో వార్షికోత్సవంలో జాతీయఅధ్యక్షుడు రాధాకృష్ణ చేతుల మీదుగా ఆయన అవార్డును అందుకున్నట్లు తెలిపారు. జాతీయస్థాయిలో ఉత్తమ సేవలు అందించినందుకు అవార్డును అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. విద్యుత్ శాఖ ఏడీ తోట రాజశేఖర్, చంద్రశేఖర్, నాగరాజు ఆయనకు అభినందనలు తెలిపారు.

జీవితంపై విరక్తితో మహిళ ఆత్మహత్య

ధర్పల్లి, అక్టోబర్ 6 : చెవులు వినిపించకపోవడంతో మనస్తాపం చెంది, మతిస్థిమితం కోల్పోయిన మహిళ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని హోన్నాజీపేట్ గ్రామంలో చోటు చేసుకున్నది. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. హోన్నాజీపేట్‌కు చెందిన బండి నర్సవ్వ (40) కూలీ పనులు చేసేది. మహిళకు కొన్నిరోజులుగా చెవులు వినిపించకపోవడంతో మానసికంగా కృంగిపోయి మతిస్థిమితం కోల్పోయింది. శనివారం సాయంత్రం 6 గంటలకు ఇంటి నుంచి కనిపించకుండా వెళ్లిపోయింది. ఆమె భర్త బండి నారాయణ నర్సవ్వ బంధువులకు సమాచారం ఇచ్చాడు. గ్రామానికి వచ్చి వెతకగా ఆదివారం ఉదయం 6 గంటలకు హోన్నాజీపేట్ గ్రామంలోని హోన్నా చెరువులో ఆమె మృతదేహం నీటిలో తేలియాడుతూ కనిపించింది. మృతురాలి తమ్ముడు చంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో బాధపడుతూ మరొకరు..

రుద్రూర్, అక్టోబర్ 6 : వర్ని మండలం జాకోరా గ్రామానికి చెందిన మనిగండ్ల సాయిలు (40) ఇంట్లో దూలానికి ఉరేవేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈనెల 5న సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి తాడుతో ఉరేసుకొన్నట్లు పోలీసులు తెలిపారు. సాయిలు నాలుగేండ్లుగా నరాల బలహీనత, పక్షవాతంతో బాధపడుతున్నాడు. జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య లక్ష్మి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తడి, పొడి చెత్తను వేరు చేయాలి

డంపింగ్ యార్డు వద్ద సిబ్బందికి సూచనలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్

కంఠేశ్వర్, అక్టోబర్ 6 : నిజామాబాద్ నగర ప్రజలు చెత్తను తడి, పొడిగా వేరుచేయాలని, చెత్తని, ప్లాస్టిక్ డ్రైనేజీలు, నాలాల్లో వేయవద్దని మున్సిపల్ కమిషనర్ మకరంద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పలు డంపింగ్ యార్డులను ఆయన ఆదివారం పరిశీలించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయవద్దని ప్రజలకు సూచించారు. ఆయన వెంట సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయానికి మాజీ ఎమ్మెల్యే విరాళం

నవీపేట, అక్టోబర్6: మండల కేంద్రంలోని ధర్యాపూర్ పురాతన మహాలక్ష్మీ ఆలయ అభివృద్ధికి మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు రూ. 1.16 లక్షల విరాళం ప్రకటించారు. ఆదివారం ధర్యాపూర్‌లోని ఆలయాన్ని స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ఆలయ స్థితిగతులను మాజీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లారు. స్పందించిన ఆయన విరాళం ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ నాలుగేండ్ల క్రితం తన అత్తగారి ఊరైన జన్నేపల్లిలో శివాలయం అభివృద్ధికి రూ. 1.50 కోట్లతో పనులు చేపట్టినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తెడ్డు పోశెట్టి, కేఎల్‌వీ రాజేందర్‌కుమార్ గౌడ్, కమిటీ సభ్యులు దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు మాజీ ఎమ్మెల్యేను కమిటీ సభ్యులు సన్మానించారు.

పద్మశాలీ సంఘం పట్టణ అధ్యక్షుడిగా గంగాధర్

నందిపేట్, అక్టోబర్ 6: మండల కేంద్రంలోని పద్మశాలీ సంఘం పట్టణ అధ్యక్షుడిగా చందన్ గంగాధర్ (డిష్)ను ఆదివారం పట్టణ పద్మశాలీ సంఘం 6 తర్పల పెద్దమనుషులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్ర పద్మశాలీ సదర్ సంఘంలో నిర్వహించిన సమావేశంలో 1వ తర్పకు చెందిన డిష్ గంగాధర్‌ను ఎన్నుకున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు. మిగతా కమిటీని త్వరలో ఎన్నుకుంటామని పేర్కొన్నారు. గౌరవ అధ్యక్షుడు మాజీ వార్డు మెంబర్ మాన్సూర్ భూమేశ్, మాజీ పట్టణ అధ్యక్షుడు బాలగంగాధర్, సీనియర్ నాయకులు దంతాల జిందం రాజేందర్, మాజీ ఎంపీటీసీ వెలిగేటి రాజు, దంతాల ఆనంద్, స్వర్గం నర్సయ్య, తర్ప అధ్యక్షులు బొడ్డు మురళి, చెలిమెల విఠల్, మెకానిక్ శ్రీను, సాంబార్ గిరి, తాటిపాముల జనార్దన్ పాల్గొన్నారు.

ప్రైవేట్ ఉపాధ్యాయులకు సన్మానం

ఉపాధ్యాయులను సన్మానించిన నిర్వాహకులు

శక్కర్‌నగర్, అక్టోబర్ 6: ఈనెల 5న ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పలువురు ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులను ఆదివారం బోధన్ పట్టణంలోని లయన్స్ కంటి దవాఖానలో సన్మానించారు. బోధన్ పట్టణ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల మేనేజ్‌మెంట్ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్థానిక పట్టణ సీఐ వెంకట నారాయణ హాజరయ్యారు. లయన్స్ కంటి దవాఖాన వ్యవస్థాపకుడు బసవేశ్వర్ రావు, లయన్స్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లక్ష్మి, ట్రస్మా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొడాలి కిశోర్, ట్రస్మా కోశాధికారి దిగంబర్ ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో బోధన్ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల సంఘం అధ్యక్షుడు ముస్త్యాల హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి మిద్దెల రాజు, కోశాధికారి కృష్ణ మోహన్, గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి భూమిపూజ

భూమిపూజ చేస్తున్న నాయకులు

భీమ్‌గల్, అక్టోబర్ 6: మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద ఆదివారం స్వాముల సన్నిధానం కోసం భవన నిర్మాణానికి భూమిపూజ చేసినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ కన్నె ప్రేమలత సురేందర్, శివసాయి మల్టీ స్పెషాలిటీ దవాఖాన డాక్టర్ సాయి దంపతులు తెలిపారు. కార్యక్రమంలో సర్వసమాజ్ కమిటీ అధ్యక్షుడు అశోక్, 3వ వార్డు కౌన్సిలర్ మూత లింబాద్రి, కొండల శ్రీను, గోవర్ధన్, రత్నయ్య, రమేశ్, శ్రీను, ఈశ్వర్ పాల్గొన్నారు.

విదేశాల్లో బతుకమ్మ సంబురాలు

డల్లాస్‌లో బతుకమ్మతో మహిళలు

దుబాయ్‌లో పాట పాడుతున్న గాయకురాలు గోదావరి

సుభాష్‌నగర్, అక్టోబర్ 6 : బతుకమ్మ ప్రకృతిని పూజించే గొప్ప పండుగ. జీవకోటి మనుగడ ప్రకృతిపై ఆధారపడి ఉందని, పూలతో పూజిస్తుండడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. తెలంగాణతో పాటు 64 దేశాల్లో స్థిరపడిన తెలుగువారు బతుకమ్మను ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి అమెరికా, ఆస్ట్రేలియా, సింగపూర్, దుబాయి తదితర దేశాల్లో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. గల్ఫ్ తెలంగాణ సంక్షేమ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో దుబాయ్‌లోని జుమైరా విలేజ్‌లో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. నవీపేట మండలం నాగేపూర్ గ్రామానికి చెందిన గాయకురాలు గోదావరి ప్రత్యేక ఆహ్వానితురాలిగా హాజరై పాడిన పాటలతో హుషారెత్తించారు.

పనిచేయని సీసీ కెమెరాలు

- రూ.లక్షలు ఖర్చుచేసి ఏర్పాటు చేసినా పట్టించుకోని అధికారాలు
- కెమెరాల నిర్వహణ బాధ్యతలు చూసుకునేది ఎవరు?

వేల్పూర్‌లో పనిచేయని సీసీ కెమెరాలు

వేల్పూర్, అక్టోబర్ 6: మండల కేంద్రంలో కొన్నిరోజుల నుంచి సీసీ కెమెరాలు పని చేయడం లేదు. వాటిని పట్టించుకునే వారు కరువయ్యారు. గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించాలని గ్రామ కమిటీ సభ్యులు మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డిని గతంలో కోరగా నియోజకవర్గ అభివృద్ధి నిధులు నుంచి రూ.5లక్షలు నిధులు మంజూరు చేశారు. గ్రామ కమిటీ సభ్యులతో స్థానిక పోలీసులు చర్చించి ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. గ్రామంలో సుమారు 16 కెమెరాలను ఏర్పాటు చేయించారు. వీటిని పోలీస్‌స్టేషన్‌కు అనుసంధానం చేశారు. కొన్ని రోజుల వరకు అవి బాగానే పని చేశాయి. ప్రస్తుతం అవి పనిచేయడం లేదు. వాటి నిర్వహణ బాధ్యతలు చూసేవారు కరువయ్యారని స్థానికులు అంటున్నారు. పనిచేయని వాటికి మరమ్మతు ఎవరు చేయించాలో అర్థం కావడం లేదని స్థానికులు అంటున్నారు. ఆగస్టు 3న వేల్పూర్‌లోని ప్రధాన కూడలి అంబేద్కర్ విగ్రహం సమీపంలోని కిరాణా షాపులో చోరీ జరిగింది. షాపు ఎదురు సీసీ కెమెరా ఉన్నప్పటికీ అది పనిచేయక పోవడంతో నిందితులను గుర్తుపట్టలేక పోయారు. లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు చిన్న చిన్న రిపేర్లకు నోచుకోవడం లేదు. వీటిని ఇలాగే వదిలేస్తే సీసీ కెమారాలు కూడా కనిపించకుండా పోతాయని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా మరమ్మతులు చేయించి వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

సంక్షిప్తంగా..

- **రేపు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ** - మోర్తాడ్, అక్టోబర్ 6: కమ్మర్‌పల్లి తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉందని తహసీల్దార్ ఆంజనేయులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమానికి అధికారులు, లబ్ధిదారులు హాజరుకావాలని కోరారు.
- **నేడు ఎమ్మెల్యే వేముల పర్యటన** - వేల్పూర్, అక్టోబర్ 6: బాల్కొండ నియోజకవర్గంలో పలు కార్యక్రమాలకు మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి హాజరవుతారు. పలు మండలాల్లో పర్యటిస్తారని తెలిపారు.
- **నేడు నీటి సరఫరాకు అంతరాయం**- శక్కర్‌నగర్, అక్టోబర్ 6: బోధన్ పట్టణంలో ఈనెల 7వ తేదీన తాగునీటి సరఫరా ఉండదని బోధన్ మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని వాటర్‌వర్క్స్ వద్ద మోటార్లకు మరమ్మతులు, ఫిల్టర్‌బెడ్స్ సర్వీసింగ్ కారణంగా నీటి సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. 8న తిరిగి యధావిధిగా నీటి సరఫరా ఉంటుందని వెల్లడించారు.
- **ఐటీఐలో ప్రవేశాలు**- శక్కర్‌నగర్, అక్టోబర్ 6:బోధన్ పట్టణంలోని మైనార్టీ ఐటీఐలో వివిధ కోర్సుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శాంతారాం ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. తమ కళాశాలలో ఆరు కోర్సులకు 6వ విడుత ప్రవేశాల కోసం http//iti telabngana.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం తమ కళాశాలలో ఈనెల 9వ తేదీ వరకు అడ్మిషన్ల కోసం ఒరిజినల్ సర్టిఫికెట్లతో సంప్రదించాలని కోరారు.
- **సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ** - మాక్లూర్, అక్టోబర్ 6 : వివిధ గ్రామాలకు చెందిన బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశామని బీజేపీ మండల అధ్యక్షుడు సురేశ్‌నాయక్ తెలిపారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి ఆదేశానుసారం చెక్కులు పంపిణీ చేశామన్నారు.
- **ప్రతి ఒక్కరూ శాఖాహారం తీసుకోవాలి** - ఆర్మూర్‌టౌన్, అక్టోబర్6: పట్టణంలోని మామిడిపల్లి వద్ద ఆనంద ఆదివారం అహింసాయుత శాఖాహార ర్యాలీ నిర్వహించినట్లు పీఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షుడు సాయికృష్ణారెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శాఖాహారాన్ని తీసుకోవాలని, ధ్యానం చేయాలని సూచించారు. వీటితో ఎన్నో ఉపయోగాలున్నాయని అన్నారు.
- **వడ్డె ఓబన్నకు నివాళి** - ఆర్మూర్‌టౌన్, అక్టోబర్6: పట్టణంలో స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డె ఓబన్న 178వ వర్ధంతిని ఆదివారం పట్టణంలో నిర్వహించారు. ఆయన విగ్రహానికి పలువురు వడ్డెర సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సంగీత తదితరులు పాల్గొన్నారు.
- **గీత కార్మికులకు అవగాహన** - ఆర్మూర్‌టౌన్, అక్టోబర్6:పెర్కిట్‌లో గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచంపై సేఫ్టీ మోకుల ఉపయోగంపై బీసీ కార్పొరేషన్ ఈడీ రమేశ్ ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గీత కార్మికులకు ప్రమాదం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కల్లు గీత కార్మిక రాష్ట్ర సలహాదారులు పెద్ది వెంకట రాములు, గీత కార్మికులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.

NT-331783-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ 4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే. ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రమాదకరంగా ప్రయాణం

- గోదావరి వంతెన గుంతలమయం
- పట్టించుకోని మహారాష్ట్ర అధికారులు

కందకుర్తి వద్ద వంతెనపై తారులేచి ఏర్పడిన గుంతలు

రెంజల్, అక్టోబర్ 6 : మహారాష్ట్ర–తెలంగాణ సరిహద్దు గ్రామమైన కందకుర్తి వద్ద గోదావరిపై నిర్మించిన వంతెన గుంతలతో ప్రమాదకరంగా మారింది. 1982లో ధర్మాబాద్– కందకుర్తి ప్రధాన రోడ్డు మార్గంలో హైలెవల్ వంతెనను మహారాష్ట్ర ప్రభుత్వం నిర్మించింది. ఏటా గోదావరిలో వరద నీరు వంతెనపై నుంచి పారుతుంటుంది. మహారాష్ట్ర అధికారులు వంతెన నిర్వహణను పట్టించుకోవడం లేదు. వంతెనపై నుంచి వరద ప్రవాహం కారణంగా బ్రిడ్జిపై తారు కొట్టుకుపోయింది. వంతెనపై సగ భాగం పూర్తిగా గుంతలమయంగా మారింది. నిత్యం వాహనదారులు ప్రణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణిస్తున్నారు. గుంతలను తప్పించే క్రమంలో వాహనాలు అదుపుతప్పి నదిలో పడే ప్రమాదముందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మహారాష్ట్ర అధికారులు గుంతలను పూడ్చివేయించాలని వాహనదారులు కోరుతున్నారు